క్లుప్తంగా

రెన్యూవల్ గడువు పెంపునకు వినతి


ప్రతాప్‌రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న చంద్రమోహన్‌రెడ్డి, సేతు

పుంగనూరు : పదేళ్లకు ఒకసారి రెన్యూవల్ చేసుకునేలా గడువు పెంచాలని ప్రైవేట్ పాఠశాలల సంఘం ప్రతినిధులు చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ సేతు కోరారు. ఈ మేరకు సోమవారం మదనపల్లెకు వచ్చిన కడప ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఆర్జేడీ సానుకూలంగా స్పందించారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

వైభవంగా అయ్యప్ప ఊరేగింపు


ఊరేగుతున్న అయ్యప్పస్వామి

వి.కోట: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఉన్న అయప్పస్వామివారికి ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి ఉత్సవమూర్తిని పల్లకిపై కొలువుదీర్చి ఊరేగించారు. వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

త్రైత గీతపై ప్రచారం


పుస్తకాలు పంపిణీ చేస్తున్న సేవా సమితి సభ్యులు

బైరెడ్డిపల్లె : మండలంలోని బురిశెట్టిపల్లె, చిక్కనపల్లె, కంచనపల్లె లో సోమవారం త్రైత సిద్ధాంత సేవా సమితి సభ్యులు త్రైత గీతపై ప్రచారం చేపట్టారు. సమితి అధ్యక్షులు అశోక్‌బాబు, బాలాజీ, భాస్కర్ మాట్లాడుతూ ఆచార్య ప్రబోదానంద యోగీశ్వరులు రచించి త్రైత సిద్ధాంతం ప్రజలకు ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు హేమంత్, హరిప్రసాద్, హేమ, తేజస్వి, చరణ్, ఝాన్సీ పాల్గొన్నారు.

ఘనంగా రేణుకాంబ తిరునాళ్ల


విశేష అలంకరణలో రేణుకాంబ

గుడిపాల: మండలంలోని గర్రాళ్ళమిట్టలో సోమవారం రేణుకాంబ తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామ వీధుల్లో ఊరేగించారు. అలాగే బొమ్మసముద్రంలో సీతారామ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవం భక్త జన సందడి నడుమ నిర్వహించారు.

వరసిద్ధునికి విరాళం


విరాళం అందిస్తున్న దాత రుక్మిణీదేవి

కాణిపాకం (యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన రుక్మిణీదేవి రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబుకు అందజేశారు. ఆమెకు స్వామివారి ప్రత్యేక దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైఎస్సార్ క్రికెట్ టోర్నీ విజేత దాసరాపల్లె


విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న కార్తీక్‌రెడ్డి

యాదమరి: మండలంలోని చెన్నారెడ్డి పల్లెలో మూడు రోజులుగా నిర్వహించిన వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్‌లో దాసరాపల్లె విజేతగా నిలిచింది. మండల వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొన్నాయి. సోమవారం నిర్వహించిన ఫైనల్స్‌లో సామిరెడ్డి పల్లె జట్టుపై దాసరాపల్లె గెలిచింది. విన్నర్స్, రన్నర్స్ జట్లకు రూ.8888, రూ.4444లతోపాటు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గుడుపల్లె వద్ద పొంగళ్ల కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్



పలమనేరు : విశేషాలంకారంలో నిర్వాణ నారాయణుడు



ఉరకలేసిన ఉత్సాహం

- అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు
- ఘనంగా కనుమ వేడుకలు
- ఆకట్టుకున్న ఎడ్ల పందేలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- అలరించిన గొబ్బి పాటలు

పంట చేతికందిన ఆనందంలో అన్నదాతలు.. ఇంటింటా ఘుమఘుమలాడే పిండి వంటలు.. రంగవల్లులతో కళకళలాడిన వీధులు.. నూతన వస్త్రాలు ధరించిన పిల్లల కేరింతలు.. తెలుగు సంస్కృతి ప్రతిబింబించేలా హరిదాసు కీర్తనలు.. ఆకట్టుకున్న గంగిరెద్దు నృత్యాలు.. అలరించిన గొబ్బి పాటలు.. బంధుమిత్రుల రాకతో సందడిగా లోగిళ్లు.. సంప్రదాయానికి పెద్దపీట వేసిన పశువుల దొడ్లు.. రంకెలేసిన కోడెగిత్తలు.. యువతలో ఉత్సాహం నింపిన పరుష పందేలు.. ఇది కదా పెద్ద పండుగంటే అనేలా సాగిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి.. కనుమ వేడుకలు కనువిందు చేశాయి.. ప్రజల్లో హర్షాతిరేకాలు వెల్లివిరిశాయి.

పలమనేరు : నియోజకవర్గంలో సోమవారం కనుమ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పశువులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ దేవతల ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేయించారు. పలు గ్రామాల్లో ఆనవాయితీగా ఎడ్లమెరవణి ఘనంగా నిర్వహించారు. ఎద్దులను ప్రభలతో అలంకరించి వీధుల్లో పరుగులెత్తించారు. మహిళలు పొంగళ్లు పొంగించారు. పట్టణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

నారాయణుడికి ప్రత్యేక పూజలు

పట్టణానికి సమీపంలోని మన్నారునాయునిపల్లె విష్ణుపురిలో వెలసిన నిర్వాణ నారాయణుడికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గుడుపల్లె : కనుమ పండుగ సందర్భంగా మండలంలోని గుడుపల్లె, అగరం, ఓయస్ కొత్తూరులోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ భరత్ పాల్గొన్నారు.

పుంగనూరు : పట్టణంలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం వీధులు సందడిగా మారాయి. మహిళలు గొబ్బెమ్మలు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుమ నాడు పశువులను విశేషంగా అలంకరించి ఊరేగింపు చేపట్టారు. కాటమరాజు ఆలయాల వద్ద చిట్లా కుప్పలకు నిప్పు పెట్టి, పశువులను ప్రదక్షిణ చేయించి, దిష్టిపరిహారం చేశారు. జానపద గీతాలు ఆలపించి , సంప్రదాయబద్ధంగా విందు భోజనాలు ఆరగించారు.

పులిచెర్ల(కల్లూరు): కనుమ పండగను పల్లెల్లో ఘనంగా జరుపుకున్నారు. పశువులను రంగు కాగితాలు, బెలూన్లతో ప్రత్యేకంగా అలంకరించారు.

సదుం: స్థానిక కాటమరాజు ఆలయం వద్ద పశువులను ఊరేగించారు. గ్రామ సరిహద్దులోని గంగ రాళ్లకు మహిళలు విశేష పూజలు చేసి అంబలిని నైవేద్యంగా సమర్పించారు.

బైరెడ్డిపల్లె : కనుమ పండుగను పురస్కరించుకుని గ్రామ దేవత ఆలయం వద్ద పశువులకు ప్రత్యేక పూజలు చేశారు.

గంగవరం : మండలంలోని అన్ని గ్రామాల్లో కనుమ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పశువులను సుందరంగా అలంకరించి వీధుల్లో పరుగులెత్తించారు.

పెద్దపంజాణి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా కనుమ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పశువులను గ్రామ దేవతల ఆలయాల వద్దకు ఊరేగింపుగా తీసుకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

రామకుప్పం: మండలంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పశువులను అలంకరించి ఊరేగించారు. ఉట్టిమాను పోటీల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.


రామకుప్పం : వీధిలో రంగవల్లులు


సదుంలో పశువుల ఊరేగింపు


బైరెడ్డిపల్లె : గంగమ్మ గుడి వద్ద పశువులకు పూజలు


కల్లూరు : చిట్లా కుప్పకు నిప్పు పెట్టే వేడుకలో జనం

ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటన రేపు

కుప్పం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి బుధవారం కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. సోమవారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు రెడ్డెప్పతో కలిసి ఆయన మాట్లాడారు. ఎంపీ మిథున్‌రెడ్డి ముందుగా ఎంఎం మహల్‌లో ఉదయం 10 గంటలకు రామకుప్పం, 11కి శాంతిపురం, 12కి గుడిపల్లె మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతారని వివరించారు. అనంతరం మధ్యాహ్నం 2.30కి కుప్పం రూరల్, 3.30 గంటలకు మున్సిపాలిటీ పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఎంపీ మిథున్‌రెడ్డి దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని స్పష్టం చేశారు.

22న సద్భావన సదస్సు

పుంగనూరు : పట్టణంలోని సాయిబాబా ఆలయ సమీపంలో ఈ నెల 22వ తేదీన హిందూ సద్భావన సదస్సు నిర్వహించనున్నట్లు హిందూ జాగరణ సమితి కన్వీనర్ రవీంద్రనాథ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ హిందూ సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సమితి నేతలు త్రిమూర్తిరెడ్డి, వినాయక పాల్గొన్నారు.

నేడు ముగ్గుల పోటీ

పలమనేరు : పట్టణంలోని గంగమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం మధ్యాహ్నం ముగ్గుల పోటీ నిర్వహించనున్నట్లు గంగమ్మ గుడి కమిటీ చైర్మన్ కండల నరేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విజేతలకు ఆలయ కమిటీ తరపున బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు.

క్రికెట్ టోర్నీ విజేత పీపీఎల్ జట్టు


విజేత జట్టుకు షీల్డ్ అందిస్తున్న రంజిత్

పలమనేరు : సంక్రాంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటులో పట్టణానికే చెందిన పీపీఎల్ జట్టు విజేతగా నిలచింది. ఈ మేరకు సోమవారం జరిగిన ఫైనల్‌లో విజేత పీపీఎల్ జట్టు కెప్టెన్ ధీరజ్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సుబ్రమణ్యానికి ఏపీపీ రంజిత్ ట్రోఫీలు బహూకరించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసంతోపాటు, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.

పెద్దిరెడ్డికి పరామర్శ

చిత్తూరు కార్పొరేషన్: అన్నమయ్య జిల్లా రాయచోటి వద్ద ఎంపీ మిథున్‌రెడ్డి, విద్యుత్, అటవీశాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రయాణిస్తున్న కారుకు తృటిలో ప్రమాదం తప్పింది. విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే గోపీనాథ్ కుమారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు భూపేష్ గోపీనాథ్ వెంటనే పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిని సదుంలోని వారి నివాసంలో కలిసి పరామర్శించారు. తనకు ఎలాంటి పెద్ద గాయాలు కాలేదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి చెప్పారు.


మంత్రి పెద్దిరెడ్డిని పరామర్శిస్తున్న భూపేష్ గోపీనాథ్

గ్రామోత్సవం

కాణిపాకం(యాదమరి): మకర సంక్రాంతి సందర్భంగా ఆదివారం రాత్రి కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి ఆలయ అర్చక వేద పండితులు శాస్త్రోక్తంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి, పల్లకిలో కొలువుదీర్చి, గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర మంగళ నీరాజనాలు సమర్పించారు.


ఉత్సవమూర్తులకు నిర్వహిస్తున్న గ్రామోత్సవం

గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు

నారాయణవనం: సంక్రాంతి సందర్భంగా మంగళవారం పాలమంగళం నార్త్ పాలీశ్వరస్వా మి, తుంబూరు తుంబీశ్వరస్వామి ఉత్సవమూర్తులతో గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకులు సాయిరవి, లక్ష్మ య్య తెలిపారు. అగస్తీశ్వరస్వామి ఆల యం బాలాలయంలో ఉన్న కారణంతో టీటీడీ అనుబంధ శైవక్షేత్రాల ఉత్సవమూర్తులు గిరిప్రదక్షిణలో పాల్గొనవని ఆలయాల అధికారి నాగ రాజు తెలిపారు. సంక్రాంతికి మూడవ రోజున టీటీడీ ఆలయాలైన చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి(నారాయణవనం), మరగదవల్లీ సమేత అగస్తీశ్వర(సముదాయం), తుంబూరు తుంబీశ్వరస్వామి, పాలమంగళం ఉత్తరపు కండ్రిగ పాలీశ్వరస్వామి ఉత్సవమూర్తులతో పాటు మరో 20 గ్రామా ల్లోని ఆలయాల ఉత్సవర్లకు నగరిలో నిర్వహించే సంధి కార్యక్రమంలో గిరిప్రదక్షిణ ఉత్సవంగా నిర్వహించడం పరిపాటి. సముదాయంలోని అగస్తీశ్వరస్వామి ఆలయంలో మరమ్మతుల కారణంతో ఉత్సవాన్ని రద్దు చేసినట్లు నాగరాజు తెలిపారు. సంప్రదాయానికి స్వస్తి పలకరాదనే ఉద్దేశంతో తుంబీశ్వరస్వామిని శనివారం ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు గ్రామ ఉత్సవ కమిటీ పేర్కొంది.

పల్లకిపై వేణుగోపాలుడి విహారం


ఉభయ దేవేరీ సమేతంగా వేణుగోపాలుడు

కార్వేటినగరం: కనుమ పండుగను పురస్కరించుకుని సోమవారం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష అభిషేకాలు జరిపించారు. రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలుడిని వివిధ పుష్పాలు, దివ్యాభరణాలతో సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం ఉభయ దేవేరుల సమేతంగా శ్రీవారిని పల్లకిపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి స్వామివారికి శాస్త్రోక్తంగా ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రమేష్‌బాబు, టీటీడీ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ గణేష్, అర్చకులు నారాయణదాసరి, గోపాల ఆచారి పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిపై గెలవలేకే రెచ్చగొట్టేది


మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి

రొంపిచెర్ల: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై గెలవలేకే టీడీపీ నేతలు యువతను రెచ్చగొడుతున్నారని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి మండిపడ్డారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసినా చంద్రబాబు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డిని ఏం చేయలేకపోయారన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ టీడీపీని మట్టికరిపించిన ఘనత పెద్దిరెడ్డికే దక్కుతుందని తెలిపారు. రొంపిచెర్లకు చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనాయతుల్లా అనారోగ్యంతో మృతి చెందితే సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10లక్షలు ఇప్పించి ముస్లిం పక్షపాతిగా మంత్రి పెద్దిరెడ్డి నిరూపించుకున్నారని కొనియాడారు. ప్రస్తుతం సబ్‌జైలులో ఉన్న టీడీపీ నేత కరీం తండ్రి జానీ బాషా మరణిస్తే వైఎస్సార్ బీమా కింద రూ.2లక్షలు మంజూరు చేయించారని గుర్తుచేశారు. నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేదని స్పష్టం చేశారు. జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డిని ఓడించడం చంద్రబాబు తరం కాదని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల రొంపిచెర్లలో జరిగిన ఘర్షణలకు చల్లా బాబు, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డే కారణమని ఆరోపించారు. పీలేరు నుంచి రౌడీలను పంపించి దాడులకు చేయించారని మండిపడ్డారు. టీడీపీ ఉచ్చులో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని యువతను కోరారు. ప్రజలు వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సలీంబాషా, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సర్పంచ్ నాగిరెడ్డి, స్థానిక నాయకులు సూర్యనారాయణరెడ్డి, కమలాకర్ రెడ్డి, కరీముల్లా, మహబూబ్‌బాషా, ఖాదర్‌బాషా, సురేంద్రనాయుడు, శేషాద్రినాయుడు, అబూబక్కర్, భాస్కర్‌రెడ్డి, బాబు, సుధాకర్‌రెడ్డి, సైఫుల్లాఖాన్, ఖాజాపీర్, రెడ్డిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కిక్కిరిసిన గంగమ్మ ఆలయం



అమ్మవారి సేవలో విజయానందరెడ్డి, భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయకట్టులో ఉన్న ఆరిమాని గంగమ్మ ఆలయానికి భక్తులు సోమవారం పోటెత్తారు. కనుమ పండుగను పురస్కరించుకుని జిల్లాతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అధికారులు పకడ్బందీగా సౌకర్యాలు కల్పించారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా ఎదురుసేవ సంబరం


ఎదురుసేవ మండపం


ఊరేగింపులో స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరునికి సోమవారం సాయంత్రం ఎదురుసేవ కార్యక్రమం సంబరంగా సాగింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదిదంపతుల కల్యాణానికి దేవతా గణాలు, మునులను ఆహ్వానించేందుకు స్వామి అమ్మవార్లు గిరిప్రదక్షిణకు వెళ్లారు. గిరిప్రదక్షిణ ముగించుకుని వచ్చిన స్వామి అమ్మవార్లకు పట్టణ శివారులోని శుకబ్రహ్మాశ్రమం సమీపంలో ఎదురు సేవ మండపం వద్ద భక్తులు ఘన స్వాగతం పలికారు. స్వామి అమ్మవారుల కొద్దిసేపు ఎదురుసేవ మండపంలో సేద తీరారు. అనంతరం స్వామి అమ్మవార్లు ఆలయానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా గిరిప్రదక్షిణ సందర్భంగా సాధారణంగా అంజూరు మండపం వద్ద వంటలు వండి శ్రీపాదకూలీలు, భక్తులకు వడ్డిస్తారు. అయితే ఈసారి ఆలయం నుంచి వండి తీసుకురావడంతో ఆలస్యమైంది. దీంతో శ్రీపాదకూలీలు, భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది. ఇక గిరిప్రదక్షిణకు ఏర్పాటైన కొత్తమార్గం కొద్దిగా ఎగుడు దిగుడుగా ఉండడంతో స్వామి అమ్మవార్లను మోసే వారు కాస్త ఇబ్బంది పడ్డారు.